

సమన్వయంతో పనిచేయండి

అందరూ కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సూచించారు. - 8లో



అదనపు లైన్‌కు ప్రతిపాదనలు

వేసవిలో విద్యుత్ అంతరాయం కలగకుండా అదనపు లైన్‌కు ప్రతిపాదనలు పంపామని ట్రాన్స్‌కో ఎస్ఈ తెలిపారు. - 8లో



అలరించిన సెలెస్టా-2కే25

చిత్తూరులో జరిగిన సెలెస్టా-2కే25 అలరించింది. సినీనటుడు కిరణ్ అబ్బవరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

పూలే జయంతిని జయప్రదం చేయండి



శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను జయప్రదం చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం జిల్లాలోని బీసీ, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళి కార్యక్రమంలో పాల్గొన్నాలన్నారు. పూలే విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని తెలియజేయాలన్నారు.

ఐటీఐ పరీక్షలకు ప్రైవేట్‌గా హాజరు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఫిట్టర్ తదితర ట్రేడ్‌లలో ప్రైవేట్‌గా పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించారని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐటీఐలో కోర్సు పూర్తి చేసిన మాజీ శిక్షణార్థుల అనుబంధ ట్రేడ్‌కు ప్రైవేట్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు అనుబంధ ట్రేడ్‌లో ఐటీఐ పూర్తి చేసి, ఫలితాల ప్రకటన తర్వాత కనీసం ఏడాది అనుభవం ఉండాలన్నారు. సీఓఈ పథకంలో ప్రస్తుతం శిక్షణార్థులుగా ఉండాలని తెలిపారు. ఎస్‌సీవీటీ అభ్యర్థులు (ఆగస్టు 2018 సెషన్ వరకు ప్రవేశం పొందిన వారు) అయి ఉండాలన్నారు. 2025 ఏప్రిల్11వ తేదీ నాటికి 21 ఏళ్లు పూర్తి అయ్యి, ఏదైనా సంస్థలో 3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలో దరఖాస్తుతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 7799201479 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సర్వర్ డౌన్

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్‌శాఖ సర్వర్ డౌన్ కావడంతో డ్యాకుమెంటేషన్లు సక్రమంగా జరగలేదు. రెండు రోజులుగా సర్వర్ నెమ్మదిగా వస్తుండడంతో ఈసీ, రిజిస్ట్రేషన్, ఈ-కేవైసీ సేవలు స్తంభించాయి. దీంతో క్రయ, విక్రయదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆగి ఆగి నెట్ రావడంతో విసుగు చెందారు. సర్వర్ వచ్చాక కార్యాలయానికి రావాలని డ్యాకుమెంటర్లు వారిని కార్యాలయం నుంచి పంపించారు. సాధారణంగా 40 వరకు జరిగే రిజిస్ట్రేషన్లు గురువారం మొత్తం 28 మాత్రమే జరిగాయి.

నేడు నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

డీసీహెచ్ఎస్ పరిధిలో పోస్టుల ప్రావిజనల్ మెరిట్‌లిస్ట్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్(డీసీహెచ్ఎస్)లోని పలు పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రావిజనల్ మెరిట్ లిస్టులను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి తెలిపారు. రెండు నెలల కిందట పలు పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలన్న ఉద్దేశంతో వైద్యశాఖ నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ దరఖాస్తులకు సంబంధించిన ప్రావిజనల్ మెరిట్‌లిస్టును గురువారం సాయంత్రం ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. ఈ జాబితా కోసం www.chittoor.ap.gov.in లో చూసుకోవచ్చన్నారు. ఇందులో అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలని ఆమె పేర్కొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు


సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖాధికారులు దాడులు చేశారు. గురువారం సాక్షి దినపత్రికలో 'ఇసుక తోడేళ్లు.. ఉచితం ముసుగులో లూటీకి తెగబడుతున్న పచ్చ ముఠాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. పలమనేరు, తవణంపల్లిలోని ఇసుక అక్రమ కేంద్రాలపై తనిఖీలు చేపట్టారు. అక్కడ తవ్వకాలను గుర్తించారు. సాక్షి దినపత్రికలో కథనం, అధికారులు తనిఖీల నేపథ్యంలో అక్రమ ఇసుక తవ్వకదారులు పరారయ్యారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ అక్రమ తవ్వకాలపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నామన్నారు. సమాచారం వచ్చిన వెంటే స్పందిస్తూ...చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక అక్రమ రవణాకు సంబంధించి 2024-25 ఆర్థికసంవత్సరంలో రూ.7.20 లక్షల వరకు జరిమానా విధించామన్నారు.

చిత్తూరు మండలం పెద్దిశెట్టిపల్లి ప్రాంతంలో కొండలు బద్దలవుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మామిడి తోటల్లో దాగి ఉన్న ఈ క్వారీ నుంచి అక్రమార్కులు ఎవరి కంట పడకుండా విలువైన గ్రానైట్‌ను దర్జాగా దోచేస్తున్నారు. అయినా పట్టించుకునే వారు కరువయ్యారు.

బంగారుపాళెం మండలం కనతల చెరువు ప్రాంతంలో కూటమి నేతలు అక్రమంగా క్వారీ నడిపిస్తున్నారని ఐదు నెలల కిందట ఫిర్యాదులొచ్చాయి. వార్తా పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన అధికారులు అలా వెళ్లి ఇలా వచ్చేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని వారు పెదవి విరిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాలకు సరిహద్దుల్లోనే చిత్తూరు జిల్లాలో ప్రకృతి ప్రసాదిత క్వారీ, గ్రానైట్ గనులు పుష్కలంగా ఉన్నాయి. కొన్ని చోట్ల ఐదు కిలో మీటర్లు.. మరికొన్ని చోట్ల ఒకటి, రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే చాలు.. పొరుగునే ఉన్న తమిళనాడుకు చేరుకోవచ్చు. ఇంకేముంది ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా అధిక మొత్తంలో గ్రానైట్ తరలించేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి, కసితీరా కొండలను కొల్లగొట్టుతున్నారు.



చిత్తూరు మండలం పెద్దిశెట్టిపల్లిలో అక్రమంగా సాగుతున్న క్వారీ

కనలేరు గుట్టు.. కసితీరా కొల్లగొట్టు

- జిల్లాలో కరుగుతున్న కొండలు
- అక్రమంగా గ్రానైట్ దందా
- కూటమి నేతల కన్నుసన్నల్లోనే అక్రమ క్వారీలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదుల పరంపర

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో అక్రమంగా మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. కూటమి నేతల కన్నుసన్నల్లో విలువైన గ్రానైట్, కంకరరాయిని కొల్లగొడుతున్నారు. అవినీతి మత్తులో జోగుతున్న రెవెన్యూ, మైనింగ్ శాఖలు మొక్కుబడి తనిఖీలు, నోటీసులతో సరిపెడుతున్నాయి. ఫలితంగా పర్యావరణం దెబ్బతింటోంది. జిల్లాలో 400 వరకు గ్రానైట్ క్వారీలున్నాయి. ఇందులో 220 వరకు క్వారీలు ప్రస్తుతం నడుస్తున్నాయి. అనధికారికంగా 70కి పైగా నడుస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే 300 వరకు గ్రానైట్ ఫ్యాక్టరీలు పని చేస్తున్నాయి. చిత్తూరు, బంగారుపాళెం, యాదమరి, ఎస్ఆర్ పురం, పాలసముద్రం, వి.కోట, రామకుప్పం, కుప్పం, నగరి, గుడిపాల, జీడీనెల్లూరు తదితర మండలాల పరిధిలో గ్రానైట్ నిల్వలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం గ్రానైట్ క్వారీల నుంచి ఘనపు క్యూబిక్ మీటరు ఆధారంగా సీనరేజ్ చెల్లించి, బ్లాక్‌లను పాలిషింగ్ యూనిట్‌కు తరలించాల్సి ఉంది. అయితే ఈ వ్యవహారంలో వ్యాపారులు, క్వారీల నిర్వాహకులు అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కంపిస్తున్న గ్రామాలు

క్వారీ పేలుళ్లలో శక్తివంతమైన జెలిటిన్ స్టిక్స్ వాడి, బండలు పేల్చడంతో ఆ పరిసర ఆ ప్రాంతాల్లోని గ్రామాలు కంపిస్తున్నాయి. ఇళ్లు బీటలు వారుతున్నాయి. బండరాళ్లుపడి వ్యవసాయ పొలాలు దెబ్బతింటున్నాయి. రాళ్లు తగిలి స్థానికులు గాయపడుతున్నారు. వ్యాధికారక రసాయనాలు గాలి, నీరులో కలిసి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.



బంగారుపాళ్యంలో క్వారీ తవ్వకాలు (ఫైల్)

నిబంధనలకు తూట్లు..

క్వారీ, గ్రానైట్ తరలింపులో పలువురు అక్రమార్కులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. క్వారీ యజమానులు కార్వీ కోసం రూ.1.50 కోట్ల వరకు ప్రభుత్వానికి ఫీజు చెల్లించి, అనుమతులు పొందాలి. ఇందుకు సర్పంచ్, పంచాయతీ అనుమతి ఉండాలి. రెవెన్యూ, అటవీ, వాతావరణ కాలుష్య, గనుల శాఖ అనుమతులుండాలి. ఇలా వీరందరి అనుమతి తీసుకున్న తరువాత పర్మిట్, వే బిల్లుతో గ్రానైట్ తీయాల్సి ఉంది. అయితే ఇవేవీ లేకుండా గ్రానైట్, క్వారీ రైట్ రైట్ చెబుతున్నారు. తమకు కేటాయించిన స్థలంలో కాకుండా మరోచోట తవ్వకాలు చేస్తున్నారు. అనుమతి ఇచ్చిన విస్తీర్ణం కంటే అధికంగా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు ఫిర్యాదు చేసిన తేలికగా తీసుకుంటున్నారు. దీంతో విలువైన గ్రానైట్ అక్రమంగా సరిహద్దులు దాటుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు తమిళనాడుకు యథేచ్ఛగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

కూటమి నేతల గుప్పిట్లో క్వారీలు

అక్రమ క్వారీల నిర్వహణ మొత్తం కూటమి నేతలు గుప్పిట్లోనే ఉన్నాయి. దీంతో మైనింగ్ శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. బడా బాబులు, రాజకీయ అండదండలు ఉన్న సంపన్నులు తాము పైకి కనిపించకుండా డమ్మీ వ్యక్తులను ముందు పెట్టి వెనుక నుంచి అక్రమ క్వారీలను నడిపిస్తున్నారు.

అక్రమ కార్వీల బాధ్యత రెవెన్యూదే

"అక్రమ కార్వీలంటే ముందు స్పందించాల్సింది రెవెన్యూ అధికారులు. భూములు, కొండలు వారి పరిధిలో ఉంటాయి. తర్వాత గనులు తవ్వకాలు జరిగితే విచారణ చేపట్టి కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఇక్కడ ఎలాంటి అవినీతికి తావుండదు. ఇద్దరు ముగ్గురు అధికారులతో కార్యాలయం నడుస్తోంది. వారితో వచ్చిన ఫిర్యాదులన్నిటినీ అప్పటికప్పుడే పూర్తి చేయాలంటే కష్టం.

-సత్యనారాయణ, మైనింగ్ శాఖ, డీడీ, చిత్తూరు

తాగునీటి సరఫరాలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అలసత్వం వహించవద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా స్వచ్ఛమైన నీటిని పంపిణీ చేయాలన్నారు. నగరాలు, గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి కచ్చితంగా శుభ్రం చేయాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీ ఉన్న చోట్ల వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. డీఈ, ఏఈలు గ్రామాల్లో పర్యటించి నీటి సమస్యలున్న ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు.

నిత్యం పరీక్షలు చేయాలి

గ్రామాల్లో సరఫరా చేసే తాగునీటిని నిత్యం పరీక్షలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన పనుల బిల్లులను వెంటనే జెడ్పీకి పంపించాలన్నారు. సంబంధిత బిల్లులను జెడ్పీలో త్వరతిగతిన మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ కుమార్, డీపీఓ సుధాకర్‌రావ్ పాల్గొన్నారు.

హార్టికల్చర్ కాంక్లేవ్ విజయవంతంగా నిర్వహించండి

మామిడి అమ్మకం, కొనుగోలుదారుల నిమిత్తం జిల్లా కేంద్రంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించే హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం మామిడి అమ్మకందారులు, కొనుగోలుదారులతో కార్యక్రమం ఉంటుందన్నారు. మామిడి ఎగుమతికి సంబంధించి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ అనుబంధ, పౌరసరఫరాలు, డీఆర్డీఏ, డీఎల్‌డీఓలు సమన్వయంతో చేపట్టాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, పట్టు పరిశ్రమ శాఖ జేడీ శోభారాణి, ఉద్యానవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, డీఎస్ఓ శంకరన్, సివిల్ సప్లెస్ డీఎం బాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విఫలరాజేనా?

మామిడి.. పండ్లలో రారాజు. మాధుర్యం..చక్కటి రుచి, సువాసనలో సాటిలేనిది చిత్తూరు మామిడి. జిల్లాలో పండే ఈ పంట ప్రపంచంలోనే పేరుగాంచింది. అందుకే ఇక్కడి మామిడి పలు విదేశాలకు ఎగుమతి.. కర్షకులకు బహుమతిగా ప్రసిద్ధి చెందింది. అయితే ప్రస్తుత అమెరికా అధ్యక్షుడి పన్నుల విధానం.. స్థానిక పల్ప్ ఫ్యాక్టరీల నిర్వాహకులు సిండికేట్‌తో ధరలు పతనం తప్పదా? అన్న సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలో మన మామిడి వి'ఫల'రాజుగా మిగిలేనా? లేక రాణించేనా? అన్న మీమాంస రైతుల్లో నెలకొంది. శుక్రవారం జరగనున్న ఉద్యానవన సదస్సులో ఏ మి జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.



- మామిడి ఎగుమతులపై 26 శాతం పన్ను విధించిన అమెరికా
- ఫలితంగా టేబుల్ వైరైటీ ధరలపై తీవ్ర ప్రభావం
- భారీగా తగ్గనున్న మామిడి ఎగుమతులు
- ఫలితంగా ఢీలా పడనున్న మామిడి ధరలు
- నేడు చిత్తూరులో మామిడి వ్యాపారులు, రైతులతో హార్టికల్చర్ కాన్‌క్లేవ్

జిల్లాలో మామిడి సాగు వివరాలు ఇలా..

సాగు	1.12 లక్షల హెక్టార్లు
మొత్తం రైతులు	60 వేలు
ప్రధాన వెరైటీలు	తోతాపూరి, నీలం, ఖాదర్
తోతాపూరి సాగు	68 వేల హెక్టార్లు
మొత్తం సగటు దిగుబడి	8 లక్షల టన్నులు
తోతాపూరి దిగుబడి	4 లక్షల టన్నులు
టేబుల్ రకాల దిగుబడి	4 లక్షల టన్నులు
విదేశాలకు ఎగుమతులు	2.5 లక్షల టన్నులు

నేడు చిత్తూరులో ఉద్యానవన సదస్సు

అమెరికా పన్నులు పెంచిన నేపథ్యం, స్థానికంగా పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్ వ్యవహారంపై నేడు జిల్లా కేంద్రంలో జరగనున్న ఉద్యానవన సదస్సుకు కలెక్టర్ , హార్టికల్చర్ శాఖ , చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌తో పాటు పలువురు మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మామిడి రైతులు, వ్యాపారులు, పల్ప్ పరిశ్రమల నిర్వాహకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్ లోనైనా మామిడి ధరలు రైతులకు గిట్టుబాటు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రైతులకు ప్రధాన ఆధారం మామిడి. ఇక్కడ 70 శాతం తోతాపురి తోటలున్నాయి. జిల్లాలోని మామిడి ఉత్పత్తుల్లో 60 శాతం మ్యాంగో పల్ప్ పరిశ్రమలకు వెళ్లగా 20 శాతం దాకా టేబుల్ వెరైటీలు విదేశాలకు ఏటా ఎగుమతి అవుతున్నాయి. ఈ ఎగుమతులపై గతంలో మామిడిపై కేవలం 5 శాతం మాత్రమే పన్ను లుండేవి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న అధిక పన్నుల కారణంగా చిత్తూరు జిల్లా నుంచి ఎగుమతి అయ్యే మామిడిపై 26 శాతం పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ఇకపై ఇక్కడి నుంచి ఎగుమతి అయ్యే 2.50 లక్షల టన్నుల మామిడిపై అధిక పన్ను ప్రభావం పడనుంది. గతేడాది సీజన్‌లో టన్ను రూ.28 వేలు వరకు ఉన్న ధరలు అమాంతం తగ్గుముఖం పట్టి టన్ను రూ.21 వేలకు చేరింది. దీంతో మామిడి రైతులకు గతేడాది నష్టాలు తప్ప లేదు. ఏటా సీజన్‌లో పల్ప్ యాజమాన్యాలు సిండికేట్ అయి ధరలను నియంత్రిస్తున్నట్లు మామిడి రైతులు ఆరోపిస్తున్నారు.

గతంలో అమెరికా పన్ను కేవలం 5 శాతమే..

జిల్లా నుంచి టేబుల్ రకాల మామిడి అమెరికాతో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌత్ ఆఫ్రికా, బెహరైన్, నేపాల్, యూఏఈ దేశాలకు ఎగుమతులు జరిగేవి. ఎక్కువ శాతం యూఎస్ఏకు వెళ్లేది. గతంలో మామిడిపై పన్ను కేవలం 5 శాతం మాత్రమే ఉండేది. కానీ ట్రంప్ గద్దెనెక్కాక పన్నులను 26 శాతానికి పెంచేశారు. భారీగా పెరిగిన పన్నులు మామిడి ఎగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపడం ఖాయంగా కనిపిస్తోంది. ఎగుమతి పన్ను పెరిగినందున ఇక్కడి వ్యాపారులు స్థానిక మామిడి తక్కువ ధరకు కొనాల్సి వస్తుంది. దీంతో మామిడి రైతులకు నష్టాలు తప్పేలాలేవు.

ఇతర దేశాలపై దృష్టి సారించాలి

ఏటా ఇక్కడి నుంచి మామిడిని ఎగుమతి చేసే పలు దేశాల్లో పన్నులు తక్కువగా ఉన్న దేశాలకు ఎగుమతులను పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు అమెరికాకు ప్రత్యామ్నాయంగా మారుతుంది.


పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్ దెబ్బ

జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల్లో 30 దాకా మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇక్కడ పండిన పంటలో 50 శాతం జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని జ్యూస్ ఫ్యాక్టరీలకు చేరుతుంది. మామిడి కాయలను పల్ప్ (మామిడి గుజ్జు) తయారు చేసి, ఇతర రాష్ట్రాలకే కాక విదేశాలకు సైతం ఎగుమతులు చేస్తుంటారు. ఏటా జూన్ తొలివారం నుంచి జులై తొలి వారం వరకు తోతాపురి సీజన్ ముగుస్తుంది. ఆపై ఆగస్టు తొలివారం వరకు నీలం లాంటి టేబుల్ రకాలతో ఇక్కడి సీజన్ అయిపోతుంది. అయితే ఏటా జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల పల్ప్ పరిశ్రమలు సైతం సిండికేట్‌గా మారి ధరలను తగ్గిస్తున్న విషయం ఏటా జరుగుతూనే ఉంది. దీంతో తోతాపురి రైతులకు ఏటా పండించిన మామిడికి గిట్టుబాటు దక్కకుండా పోతోంది.



జిల్లాలో అధికంగా సాగు అవుతున్న తోతాపురి రకం మామిడి


మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



ఇప్పుడున్న పరిస్థితుల్లో మామిడి రైతుకు గిట్టుబాటు ధర టన్ను రూ.30 వేల దాకా ఉండాలి. ఏటా గుజ్జు పరిశ్రమల సిండికేట్‌తో ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తోతాపురి కాయలు కోతల కొచ్చే సమయంలో ఉన్నట్టుండి ధరలు తగ్గుముఖం పడితే రైతులకు తీవ్ర నష్టం వస్తుంది. దీనిపై ఉన్నతాధికారులు పల్ప్ పరిశ్రమ నిర్వాహకులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలి.

– సుబ్రహ్మణ్యంనాయుడు, రామాపురం, పలమనేరు మండలం

ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి



ఏపీలో పొగాకు బోర్డు ఉన్నట్లే.. మామిడికి బోర్డు ఏర్పాటు చేయాలి. దీంతో పాటు మామిడికి మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించాలి. ఏడాదంతా రైతులు పండించిన మామిడిని అమ్ముకునే సమయంలో గుజ్జు పరిశ్రమల సిండికేట్ కారణంగా తక్కువ ధరకు ఇవ్వాల్సి వస్తోంది. ఈ విడత టేబుల్ రకాల మామిడిని అమెరికాకు పంపేందుకు రైతులు అసలు ముందుకురారు. దీనిపై కేంద్రం చర్యలు తీసుకోవాలి.

– ఉమాపతి నాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

మురళీరెడ్డి కేసులో పోలీసులపై హైకోర్టులో పిటిషన్

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళీరెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేసి, అతని ఇంటిపై విధ్వంస కాండకు పాల్పడడంపై రాష్ట్ర హైకోర్టులో గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి తెలిపారు. మురళిపై మారణాయుధాలతో దాడి చేసి, ఇంటిపై దాడి చేస్తే.. ఘటనా స్థలంలో ఉన్న పోలీసులు ఏ మాత్రం స్పందించకపోయిన విషయం తెలిసిందే. బాధితుడి వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీల్లో, దాడి అనంతరం నిందితులు దర్జాగా వెళుతుంటే.. పోలీసులు వాళ్లను సాగనంపేలా వీడియోలు లభించాయి. పైగా నిందితులపై సాధారణ సెక్షన్లను నమోదు చేశారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించినట్లు విజయానందరెడ్డి తెలిపారు. దాడి జరిగిన రోజున, సంఘటన స్థలంలో ఉన్నా, ఏమీ చేయలేకపోయిన చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, అప్పటి వన్‌టౌన్ సీఐ జయరామయ్య, తాలూకా సీఐ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ నెట్టికంటయ్య, తాలూక ఎస్ఐ మల్లికార్జునను బాధ్యులుగా చేస్తూ అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. బాధితుడి తరపున మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టులో వాదనలు వినిపించారని.. పోలీసులు ఈనెల 29వ తేదీన హైకోర్టు ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని విజయానందరెడ్డి తెలిపారు. తమ కార్యకర్తల జోలికి వస్తే ఎవరినీ వదిలే ప్రసక్తేలేదని, వీళ్లపై న్యాయపరంగా ముందుకు వెళతామని ఆయన హెచ్చరించారు.





క్లుప్తంగా

జ్యోతిబా పూలే జయంతి ఘనంగా నిర్వహించండి


కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో ఈ నెల 11వ తేదీన మహాత్మాజ్యోతి బా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాత్మా జ్యోతి బా పూలే జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ వర్గాలకు చెందిన 500 మంది లబ్ధిదారులకు రూ.11,66,30,000 విలువ గల ఆస్తులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘ నాయకులు, అధికారులు, అనధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

ఉత్సాహంగా తపాలా క్రీడా పోటీలు


సాధించిన బహుమతులతో ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: తపాలాశాఖ ఉద్యోగులకు ఎన్ఎఫ్‌పీఈ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడ పోటీలు నిర్వహించారు. స్థానిక మెసానికల్ మైదానంలో క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా జరిగింది. ఈ పోటీల్లో చిత్తూరు దక్షిణ సబ్ డివిజన్ జట్టు విజేతగా నిలిచింది. ఆటగాళ్లకు తపాలా శాఖ సూపరింటెండెంట్ లక్ష్మన్న పతకాలను ప్రదానంచేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన సెలెస్టా-2కే25

కాణిపాకం: చిత్తూరు నగరంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో కేరళ మేళంతో సెలెస్టా-2కే25 అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత కాలేజీ కుర్రకారు స్టేజీపై స్టెప్పులేసింది. విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు కేక పుట్టించాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నటుడు కిరణ్ అబ్బవరం సెలెస్టాను ఉద్దేశించి మాట్లాడారు. స్టేజీపై స్టెపులేసి అలరించారు. కార్యక్రమంలో చైర్మన్ రావూరి వెంకటస్వామి, రావూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం


సదుం: మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప


ఎంపీకి వినతిపత్రాలు ఇచ్చేందుకు వచ్చిన జనం

సదుం: పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా తాము ఉంటామని, ఎవరు, ఏ కష్టానికి భయపడాల్సిన పని లేదని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మాధవితో కలసి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు అధికారులపై పలు ఫిర్యాదులు చేశారు. చర్యలు తీసుకుంటామని, అమాయకులైన ప్రజలను, పార్టీ కార్యకర్తలను, నాయకులను అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పులు చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎంపీ స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించడానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించడమే తమ ఆశయమని చెప్పారు. ప్రతి ఒక్కరినీ కలసి, సమస్యలు తెలుసుకుంటానని, ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తామని ఎంపీ ప్రతి ఒక్కరికీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీని కలిసేందుకు వచ్చిన వారందరికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, పుత్రాజ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ అనుబంధ సంస్థల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎంపీ హామీ

సదుం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు తన సొంత నిధులు కేటాయిస్తామని ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ సభ్యులు మల్లెల గిరి, లోకనాథం, శ్రీరాములు ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ తక్షణమే పనులు చేయాలని, సొంత నిధులతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘన స్వాగతం

సదుం మండల కేంద్రంలో పర్యటనకు వచ్చిన ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బూరగమందక్రాస్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే శాలువ కప్పి సన్మానం చేశారు.

జర్నలిస్టుల ఆహ్వానం

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలకు హాజరుకావాలని ఆ సంఘం ప్రతినిధులు ఎంపీ మిథున్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈనెల 22న చిత్తూరులో జరగనున్న సభలకు తప్పక హాజరుకావాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ప్రతినిధులు జయరాజు, రామయ్య, సలీం, సతీష్, ప్రకాష్, సైపుల్లా, అప్ప, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- భూ సమస్యలు ఉంటే జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేయండి
- ఎస్పీ మణికంఠ చందోలు


గంగమాంబాపురం వద్ద వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు


భూ వివాదానికి సంబంధించి వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

కార్వేటినగరం: జిల్లాలో ఎవరైనా భూములను ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వీ.ఎన్ మణికంఠ చందోలు హెచ్చరించారు. గురువారం మండలంలోని గంగమాంబాపురంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న భూ వివాదాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ గ్రామాన్ని సందర్శించారు. పరిస్థితులేమిటో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడ భూ వివాదాలపై రెవెన్యూ, పోలీసు అధికారుల నివేదిక ఆధారంగా బాధితులకు న్యాయం చేస్తామని, గ్రామంలో ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. భూ ఆక్రమణలపై సైతం జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో ప్రతి సోమవారం ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం కార్వేటినగరం సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్, సీఐ హనుమంతప్ప, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డీఎస్సీ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి బీసీ సంక్షేమ శాఖ అధికారి మునీంద్రయ్య గురువారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, శిక్షణకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. టెట్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీఎస్ కులాల అభ్యర్థులకు మాత్రమే ఈ అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అనంతరం కలెక్టరేట్‌లోని జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9177429494 సెల్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

అదనపు లైన్‌కు ప్రతిపాదనలు

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా నూతనంగా అదనపు లైన్‌కు ప్రతిపాదన పెట్టినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. గురువారం చిత్తూరు రూరల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని ఎస్ఎస్ కొండ, వెదురుకుప్పం ప్రాంతాల్లో లోడ్ పెరుగుతుందన్నారు. వీటిని సర్దుబాటు చేయడానికి మాంబేడు సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదన పెట్టామన్నారు. అలాగే అదనంగా కొత్తపల్లెమిట్ట నుంచి వేపంజేరి, ఎస్ఎస్ కొండకు 17 కిలోమీటర్లు రూ.80 లక్షల వ్యయంతో 33 కేవీ లైన్ ఏర్పాటుకు నివేదిక పంపామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రూరల్ పరిధిలో విడుదల చేయాల్సిన వ్యవసాయ సర్వీసుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఉన్న వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సురేష్, డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడి మృతి

మరొకరి పరిస్థితి విషమం


రాజేంద్రనాయుడు(ఫైల్)

ఐరాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎగువ కామినాయనపల్లెకు చెందిన మాజీ సైనికుడు రాజేంద్రనాయుడు(65) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాణిపాకం ఏఎస్ఐ కథనం మేరకు.. ఎగువ కామినాయనపల్లెకు చెందిన మాజీ సైనికుడు రాజేంద్రనాయుడు, భార్య లక్ష్మి ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి బుధవారం రాత్రి సొంత పనుల నిమిత్తం జంగాలపల్లెకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అదే సమయంలో తవణంపల్లె మండలం పట్నం గ్రామానికి చెందిన హరీష్ ఐరాల నుంచి పట్నం వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో జంగాలపల్లె బస్‌స్టాప్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో రాజేంద్రనాయుడు, హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని 108లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం రాజేంద్రనాయుడుని వేలూరు సీఎంసీకి తరలించారు. రాజేంద్రనాయుడు అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా హరీష్‌కు తలలో రక్తం గడ్డ కట్టడంతో రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణ కల్పించండి


మాట్లాడుతున్న ప్రేమజంట

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రేమ వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని చౌడేపల్లి మండలం బీర్జేపల్లెకు చెందిన అనూహ్య, చిట్టిరెడ్డిపల్లెకు చెందిన వంశీ తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రేమజంట జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అనూహ్య మాట్లాడుతూ తాను వంశీని ఏడేళ్లుగా ప్రేమిస్తున్నానని, కులాలు వేరు కావడంతో మా తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించలేదని చెప్పారు. దీంతో తామిద్దరం ఇష్టపూర్వకంగా వివాహం చేసుకున్నామని చెప్పారు. తమ ప్రాణాలకు ఎటువంటి అపాయం కలగకుండా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పిడుగుపడి పాడి ఆవు మృతి


పాడి ఆవు కళేబరం

గుడిపాల: మండలంలోని చిత్తపార గ్రామానికి చెందిన పాడిరైతు చంద్ర పోషిస్తున్న పాడి ఆవు గురువారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. చంద్ర పొలాల వద్ద ఇల్లు కట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈయన వ్యవసాయంతో పాటు ఐదు పాడి ఆవులు కూడా పోషిస్తున్నాడు. రాత్రి పిడుగులు పడడంతో చింతచెట్టు కింద కట్టి ఉంచిన పాడి ఆవు మృతి చెందింది. ప్రభుత్వం తనని ఆదుకోవాలని బాధితుడు కోరారు.

సారా స్థావరాలపై దాడి

- ఇద్దరి అరెస్టు


సీజ్ చేసిన వాహనం, సారా, నల్లబెల్లం చూపుతున్న సీఐ శ్రీనివాసరెడ్డి

విజయపురం : మండలంలోని కేవీపురం దళితవాడలో గురువారం నగరి ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాసరెడ్డి, తన సిబ్బందితో సారా స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, టాటా ఎస్ మినీవ్యాన్, 10 లీటర్ల సారా, 500 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం గ్రామాల్లో సారా నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సారా తయారీ చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14405, లేదా 9440902549 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ రాకేష్ , సిబ్బంది ఉన్నారు.

ఈ ఆస్పత్రికి బిడ్డలను తెస్తే బతకడంలే!

- ఏరియా ఆస్పత్రిలో మూడు నెలల చిన్నారి మృతి
- వైద్యుల నిర్లక్ష్యమేనని తల్లిదండ్రుల ఆరోపణ


ఆస్పత్రిలో మృతి చెందిన చిన్నారిని చూసి విలపిస్తున్న తల్లిదండ్రులు

పలమనేరు: 'ఈ ఆస్పత్రికి బిడ్డలను తీసుకుని ఎప్పుడొచ్చినా ప్రాణాలతో బతకడం లేదు. ఇప్పుడు మా బిడ్డ, అంతకుముందు మా బామ్మర్ది బిడ్డ.. ప్రభుత్వాస్పత్రంటే ప్రాణాలను కాపాడాలిగానీ.. ఇలా చంపేస్తుంటే ఎలాగా ?.' అని ఆ తల్లిదండ్రులు ఆస్పత్రి వద్ద బిడ్డ శవాన్ని వడిలో పెట్టుకుని రోదిస్తుంటే అక్కడున్నవారు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సంఘటన పలమనేరు ప్రభుత్వ ఏరియాస్పత్రిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలమనేరు మండలంలోని టి.వడ్డూరు గ్రామానికి చెందిన గణేష్ కుమార్తె (3 నెలల పసికందు)కు శ్వాస ఆడడంలేదని స్థానిక ఆస్పత్రికి గురువారం ఉదయం తీసుకొచ్చారు. ఆ శిశువు పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే ఆస్పత్రిలోని ఎస్‌బీఎస్‌యూకు తరలించారు. అక్కడ ఆక్సిజన్ పెట్టి, బేసిక్ లైఫ్ సపోర్ట్ కోసం సీపీఆర్ కూడా చేశారు. కానీ ఆ పసికందును బతికించలేకపోయారు. తల్లిపాలు పట్టించేటపుడు చిన్నారికి పొరపోయి పాలు ఊపిరితిత్తుల్లోకి చేరడంతో శ్వాస ఆడకుండాపోయిందని వైద్యులు చెబుతున్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం ఇక్కడి వైద్యుల నిర్లక్ష్యమే తమ బిడ్డ మృతికి కారణమని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రిలోని వైద్యులు డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ఆ చిన్నారికి ఆరోగ్యం బాగోలేక తల్లిదండ్రులు చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు చేయించి ఇంటికి తీసుకొచ్చారన్నారు. ఉన్నట్టుండి శ్వాస ఆడకపోవడంతో ఇక్కడికి తీసుకొచ్చారని, తాము అన్ని రకాలుగా ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించామని తమ నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్న అభ్యర్థులు ఏపీ-ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో ఈ నెల 14 నుంచి మే 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మండల, మున్సిపల్, జిల్లా కమిటీల స్థాయిలో వివిధ కార్పొరేషన్ల నిబంధనలు, లక్ష్యాల మేరకు ప్రాథమికంగా ఎంపిక, పథకాలు మంజూరు చేసి బ్యాకెండ్ సబ్సిడీ విధానం అమలు చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 21 - 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం, విద్యార్హతలు ఉండాలని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు మీసేవ కేంద్రాల్లో, సొంతంగానైనా www.apobmmr.a pcfrr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

రుణాల పథకాలివీ..

పథకంపేరు	అందజేసే రుణాల సంఖ్య	మొత్తం యూనిట్ విలువ(రూ.లక్షల్లో)	సబ్సిడీ రూ.లక్షల్లో	బ్యాంకు రుణం రూ.లక్షల్లో	లబ్ధిదారుని వాటా రూ. లక్షల్లో
పరిశ్రమలు సేవా వ్యాపారం	656	2348.75	921.47	1309.57	117.44
రవాణారంగం	290	1554.00	585.20	891.10	77.70
వ్యవసాయ రంగం	08	80.00	64.00	12.00	4.00
మొత్తం	954	3982.75	1570.94	2212.67	199.14

సమన్వయంతో పనిచేయండి

- ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తోంది
- ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


గోవర్ధన్‌రెడ్డిని పరామర్శిస్తున్న నారాయణస్వామి

వెదురుకుప్పం: అందరూ కలిసికట్టుగా ఉండి సమన్వయంతో పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని మాంబేడు గ్రామంలో పర్యటించి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బండి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం ఆయన నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి, అధికారంలోకి వచ్చిందన్నారు. కక్ష కట్టుకుని పేద వారిపై వివక్ష చూపుతుందని చెప్పారు. జగనన్న హయాంలో కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకతీతంగా సేవలు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఏడాది గడవక ముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుంటున్న విషయాన్ని గమనించాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. కార్యకర్తలకుగా అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్, సర్పంచ్ గోవిందయ్య, మాజీ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, గోవిందన్, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం , వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్ రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, యువజన విభాగం మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ జగదీష్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశ్, కేశవులు, ఆర్ముగం, వెంకటాచలం, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఎంపీతో మాజీ మంత్రి భేటీ

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఎంపీ మిథున్‌రెడ్డిని గురువారం తిరుపతిలోని ఎంపీ నివాసంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు.

ఉన్నతాశయంతో ముందుకు సాగాలి


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు ఉన్నతాశయంతో ముందుకు సాగాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఐఎన్‌టీఎస్ఓ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ సాధించిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీ పరీక్షలపై పట్టు పెంచుకోవాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఎంత కష్టమైనా విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు అన్ని అంశాలపై పట్టు పెట్టుకోవాలన్నారు. కాగా ఒలంపియాడ్ పరీక్షల్లో ఏడో తరగతి చదువుతున్న ఈషాప్రీతి (గ్రాండ్ బహుమతిగా ల్యాప్‌టాప్), నాలుగో తరగతి చదువుతున్న కీర్తన్‌కుమార్, ఐదో తరగతి చదువుతున్న తస్మియా ఫర్హాద్, తేజేష్, ఆరో తరగతి చదువుతున్న వెన్నెల, తొమ్మిదో తరగతి చదువుతున్న కీర్తన ట్యాబ్‌లు కైవసం చేసుకున్నారు. ఆ విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు, సర్టిఫికెట్, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల రీజినల్ ఇన్‌చార్జి చక్రధర్, ప్రిన్సిపాళ్లు సాగరిక, రేఖ, రేణుక, అకడమిక్ కోఆర్డినేటర్లు రవికుమార్, మొహమ్మద్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం


స్వామివారికి గొడుగు పడుతున్న అర్చకులు

తిరుమల: శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి స్నపన తిరుమంజనాన్ని వేడుకగా నిర్వహించారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు నివేదించారు. అనంతరం శ్రీవారు తమ దేవేరులతో తిరుమాడ వీధుల్లో విహరించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WALK-IN-INTERVIEW
Office Assistant (Female)
Qua: Any Degree
Attender (Male)
Qua: 10th/ Intermediate
Office timing: 10am to 6 pm
ALL INDIA INSTITUTE OF LOCAL SELF GOVERNMENT
9-12-1/3, Kesavayanagunta, Above Sapthagiri Grameena bank, Tirupati,
Cell: 93912 19991

WALK-IN-INTERVIEW
ON 12.04.2025 (SATURDAY) Bet. 10AM TO 2PM
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, పీలేరు, చంద్రగిరి, రేణిగుంట, నగరి బ్రాంచ్‌ల నందు పనిచేయుటకు క్రింది సిబ్బంది కావలెను.
FIELD EXECUTIVES
RECOVERY EXECUTIVES
TELE CALLER (FEMALE)
డిగ్రీ/ MBA కలిగి 28 సం॥లలోపు వయస్సు గల యువకులు సర్టిఫికెట్లు, బయోడేటా, దిగువ తెలిపిన చిరునామాకు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. జీతం: రూ.15,000/- + ఇన్సెంటివ్స్(10,000/- వరకు) లు ఇవ్వబడును. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. టూవీలర్ కలిగి వుండవలెను.
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
సెల్: 9676337863, 8074678803

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate
PLOT FOR SALE
■8 లక్షలకే తిరుపతి IIT, IISER విద్యాసంస్థల ప్రక్కన ఫైనల్ అప్రూవ్‌తో ప్లాట్లు, డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర: 9502774175, 7995992114.

Wanted
■మెడికల్ సంబంధిత రికార్డ్స్ రాయడానికి మరియు క్యాప్చింగ్ వర్క్ Online చేయడానికి అభ్యర్థులు కావలెను. జీతం: 12,000 to 18,000. ✆ 99089 59762.
■మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. ఆధ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459.
■ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు శ్రీసిటీ, నాయుడుపేటలో డ్యూటీచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ ASO అర్జెంటుగా కావలెను. Qualification: 10th. సంప్ర:99089 54793, 97019 99159.
■ఉద్యోగ కావలెను VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. 7995365999
■రాజ్ ఎంటర్‌ప్రైజెస్,DR మహల్ రోడ్, తిరుపతి నందు పని చేయుటకు Tally నాలెడ్జి గల అకౌంటెంట్, గోడౌన్ ఇన్‌ఛార్జ్ కావలెను. సంప్రదించండి: 9866672833.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాలుగులైన్ల ప్రకటనకు రూ. 375/- అదనపు లైనుకు రూ.:90/- ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
CONTACT : 9440166091, 9951602970